క్లుప్తంగా

నేడు మంత్రి పెద్దిరెడ్డి పర్యటన

సదుం: మండలంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం పర్యటించనున్నారు. 18 పంచాయతీలలో ఆయన ఎన్నికల ప్రచారం చేస్తారని పార్టీ నాయకులు తెలిపారు.

13, 14న మంత్రి పెద్దిరెడ్డి పర్యటన


పులిచెర్ల(కల్లూరు): రాష్ట్ర అటవీ, పర్యావరణ, గనులు, భూగర్భ, అటవీ శాఖామంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈనెల 13, 14న మండలంలోని అన్ని పంచాయతీలలో పర్యటించనున్నట్లు ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ తెలిపారు.13న 13 పంచాయతీలు, 14న 12 పంచాయతీలలో మంత్రి ఎన్నికల ప్రచారం చేస్తారని, పార్టీ శ్రేణులు దీనిని విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థికి వైద్యం కోసం..


హేమాద్రి తల్లిదండ్రులకు ఆర్థికసాయం చేస్తున్న కళాశాల వైస్ చైర్మన్ సునీల్‌రాజ్

కుప్పం రూరల్: లుకేమియా వ్యాధితో బాధపడుతున్న తమ కళాశాల విద్యార్థికి హేమాద్రికి కుప్పం ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు ఆర్థికసాయం చేశారు. శాంతిపురం మండలానికి చెందిన హేమాద్రి కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో 3వ సంవత్సరం కంప్యూటర్స్ చదువుతున్నాడు. అతడు లుకేమియా బారిన పడ్డాడు. వైద్యానికి అధిక మొత్తంలో ఖర్చు అవుతుండడంతో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు చందాల రూపంలో రూ.1.20లక్షలను సేకరించారు. ఈ మొత్తాన్ని కళాశాల వైస్ చైర్మన్ సునీల్‌రాజ్ హేమాద్రి తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపల్ భాస్కరన్, ప్రవీణ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంగమ్మకు దూడ సమర్పణ


బోయకొండ గోశాలకు దూడను అందజేస్తున్న రైతు రెడ్డెప్ప

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ దేవస్థానం గోశాలకు దిగువపల్లె మోట్లపల్లెకు చెందిన కె.రెడ్డెప్ప రూ.18వేల విలువైన దూడను సమర్పించారు. తన మొక్కు ఫలించడంతో పూజలు నిర్వహించి దూడను గోశాల ఇన్‌చార్జికు ఆయన అప్పగించారు. ఆలయ అధికారులు దాతను సన్మానించి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మల్లి, డిష్ సూరి పాల్గొన్నారు.

సూర్యప్రభపై లోకాభిరాముడి చిద్విలాసం


సూర్యప్రభ వాహనంపై దర్శనమిస్తున్న శ్రీకోదండరామస్వామి

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు గురువారం ఉదయం 8 గంటలకు స్వామివారు సూర్యప్రభ వాహనంపై కొలువై లోకాభిరాముడు తేజోవిలాసంతో విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. ఉదయం 10.30 గంటలకు ఆలయ ఆవరణలో శ్రీసీతాలక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామి వారి ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు.. రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు స్వామివారి చంద్రప్రభ వాహన సేవ వేడుకగా నిర్వహించారు. తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, డెప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, కంకణభట్టర్ సీతా రామాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు చలపతి, సురేష్ పాల్గొన్నారు.

కోడి పందెం రాయుళ్ల అరెస్టు

గంగాధర నెల్లూరు: మండలంలోని పాపిరెడ్డిపల్లె శివారు చెరువులో కోడి పందేలరాయుళ్లను అరెస్టు చేసినట్టు సీఎం శంకర్ తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ, ముందుగా అందిన సమాచారం మేరకు దాడి చేసినట్టు తెలిపారు. ఎనిమిది మంది పందెం రాయళ్లను అరెస్టు చేసినట్టు తెలిపారు. వారి నుంచి రూ.11,220 నగదు, 7 పందెం కోళ్లు, 6 కత్తులు, 6 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

వరసిద్ధుని సేవలో కర్ణాటక హైకోర్టు జస్టిస్

కాణిపాకం(చిత్తూరు రూరల్): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని గురువారం కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అశోక్ ఎస్ కినాగి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వచనం పలికారు. స్వామి చిత్రపటం, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, అధికారులు వాసు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు పెద్ద మసీదులో ముస్లింలతో కలిసి రంజాన్ నమాజు చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ, పలమనేరు: ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు, పుంగనూరు: శ్మశానవాటికలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు





భక్తిశ్రద్ధలతో 'ఈద్ ఉల్ ఫితర్'

- మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు
- రంజాన్ పండుగ విశిష్టతపై మతపెద్దల ధార్మికోపన్యాసాలు
- ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేసిన ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: బుధవారం రాత్రి నెలవంక దర్శనంతో ముస్లింలకు పవిత్రమైన రంజాన్ మాసం ముగిసింది. నెల రోజుల ఉపవాసాల అనంతరం ఈద్ ఉల్ ఫితర్ (రంజాన్) పండుగను పట్టణంతోపాటు మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పలమనేరు తోపాటు జెండామఠం, తాలూకా కచ్చేరి వీధి, మసీదు వీధి, కంసల వీధి, జిలాని సర్కిల్, గంటావూరు కాలనీ, బొమ్మిదొడ్డి ఈద్గా, నాగమంగళం, ఎద్దుల సంత వీధిలోని మర్కస్ కాంప్లెక్స్ ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు రంజాన్ విశిష్టతపై ధార్మికోపన్యాసం చేశారు. ఇస్లాంలోని ఐదు నియమాల్లో అత్యంత ముఖ్యమైన సేవా భావం గురించి విపులంగా తెలియజేశారు. నమాజ్ అనంతరం పరస్పరం ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలను తెలుపుకున్నారు. అలాగే పలమనేరు రూరల్ మండలంలోని కొలమాసనపల్లె, రాజీవ్‌నగర్ కాలనీ, పకీర్‌పల్లె, నాగమంగళం మసీదుల్లోనూ ప్రార్థనలు చేశారు. పట్టణంలో పలుచోట్ల పేదలకు ముస్లింలు అన్నదానం చేశారు. నియోజకవర్గంలోని ముస్లింలకు ఎమ్మెల్యే వెంకటేగౌడ శుభాకాంక్షలను తెలిపారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: మండలంలో ఉదయం నుంచే ఈద్గాలన్నీ సందడిగా కనిపించాయి. 'అల్లాహు అక్బర్.. అల్లాహు అక్బర్.. లా ఇలాహ ఇల్లల్లాహు అల్లాహు అక్బర్.. అల్లాహు అక్బర్ వలిల్లాహిల్ హంద్' అని అల్లా నామస్మరణ చేస్తూ మసీదు నుంచి ఈద్గా మైదానం వరకు ముస్లింలు పెద్ద ఎత్తున ఊరేగింపుగా చేరుకున్నారు. ఈ సందర్భంగా మత పెద్దలు ధార్మికోపన్యాసం చేశారు. త్యాగానికి ప్రతీక రంజాన్ అని, ప్రతిఒక్కరూ పరోపకార గుణాన్ని అలవరచుకుని దైవం చూపిన సన్మార్గంలో నడుచుకోవాలని ఉద్బోధించారు. ఓర్పు, సహనం, దాతృత్వం, ఆధ్యాత్మికత గుణాలు కలిగి ఉండటమే రంజాన్ అని అన్నారు. నమాజ్ అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకునిఈద్ ముబారక్ తెలుపుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఎంపీపీ రెడ్డెప్ప, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాగారెడ్డి ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: మండలంలోని ముస్లింలు గురువారం రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. బైరెడ్డిపల్లె మసీదుల నుంచి ముస్లింలు ర్యాలీగా చెక్‌పోస్టు కూడలిలోని ఈద్గా వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత గురువులు ధార్మిక సందేశమిచ్చారు.

పుంగనూరులో..

పుంగనూరు: నెల రోజుల కఠోర ఉపవాస దీక్షలను ముస్లింలు గురువారం విరమించి, చేసిన రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించారు. పుంగనూరు, మండలంలోని మసీదులు, ఈద్గాల వద్ద నమాజ్‌కు వేలాది మంది ముస్లింలు పోటెత్తారు. ఈద్గాల వద్ద స్థలం చాలకపోవడంతో రహదారులపై కూర్చుని నమాజ్ చేశారు.అలాగే శ్మశానవాటికలకు వెళ్లి తమ ఆత్మీయుల సమాధుల వద్ద ప్రార్థనలు చేసి నివాళులు అర్పించారు. పట్టణంలోని ఎస్ఎస్.పేట, ఎంఎం.మహమ్మదాలి ఈద్గాల వద్ద, రాంపల్లె వద్ద, కుమ్మరవీధి వద్ద ముస్లింలు ప్రార్థనలు చేశారు. ఖురాన్‌పఠనం చేసి నమాజ్ చేశారు. మహిళలు వారివారి ఇళ్లలో ప్రార్థనలు చేశారు. తొలుత ఈద్గాలకు ప్రదర్శనగా మత పెద్దలు, ముతవల్లిలతో కలసి వెళ్లారు. ఇండ్ల పేదలకు దానధర్మాలు చేశారు. హిందూ-ముస్లింలు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, సీమ జిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్ షరీఫ్, అంజుమన్ కమిటి అధ్యక్షుడు ఎంఎస్ సలీం, సున్ని అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఇనాయతుల్లా షరీఫ్ ఆధ్వర్యంలో రంజాన్ వేడుకలు నిర్వహించారు. సీఐ రాఘవరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: మండలంలోని ముస్లిం మైనారిటీలు గురువారం భక్తిశ్రద్ధలతో రంజాన్ పండుగను జరుపుకొన్నారు. చౌడేపల్లె, కోటూరు, దాదేపల్లె, పెద్దూరు, కాగతి, ఏ.కొత్తకోట, అంకుతోటపల్లె, ఓదులపేట, లద్దిగం, ఖాన్‌సాబ్‌మిట్ట, బుటకపల్లె, తదితర గ్రామాల్లోని ముస్లింలు ఊరేగింపుగా ఈద్గా వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత గురువులు ధార్మికోపన్యాసం చేశారు. ఆధ్యాత్మిక చింతనతోపాటు సేవా గుణాన్ని కలిగి ఉండాలన్నారు. అనంతరం ఈద్ ముబారక్ అంటూ ఒకరికొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

సదుంలో..

సదుం: మండలంలో రంజాన్ పర్వదినాన్ని గురువారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సదుం, ఊటుపల్లె, చెరుకువారిపల్లె, బూరగమంద, చింతపర్తి వారిపల్లె, పాలమంద తదితర గ్రామాల్లో పండుగ సందడి నెలకుంది. సదుంలో మసీదుల నుంచి ఊరేగింపుగా కాలేజీరోడ్డులోని ఈద్గా మైదానానికి ముస్లింలు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దయ, శాంతి, క్షమ, దాన గుణాలు అల్లాహ్‌కు చేరువ చేస్తాయని మత పెద్దలు ధార్మికోపన్యాసం చేశారు. పేదలకు దానధర్మాలు చేశారు. పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

పులిచెర్ల మండలంలో..

పులిచెర్ల(కల్లూరు): మండలంలో రంజాన్ పండుగ వేడుకలను గురువారం ముస్లిం మైనారిటీలు ఘనంగా నిర్వహించారు. ఉదయం కల్లూరు, మంగళంపేట, కొత్తపేట, పులిచెర్ల, ఎర్రపాపిరెడ్డిగారిపల్లె, గేటుకాడ బెస్తపల్లె, జెండామాను, సువ్వారపువాండ్లపల్లె, కొమ్మిరెడ్డిగారిపల్లె తదితర ప్రాంతాల్లోని ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరికి రంజాన్ శుభాకాంక్షలు చెప్పు కున్నారు. పేదలకు దానధర్మాలు చేశారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: రంజాన్ పండుగ- మత సామరస్యానికి, సుహృద్భావానికి, సర్వ మానవ సౌభ్రాతృత్వానికి, దాతృత్వానికి ప్రతీక అని మత గురువులు పేర్కొన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలు ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నెల రోజులు ఉపవాస దీక్షలు ముగిసే రోజునఈద్ ఉల్ ఫితర్ పండుగను ఘనంగా నిర్వహించడం పరిపాటి. పరస్పరం ఈద్ ముబారక్, ఈద్ సద్ అని రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఈద్గా వద్ద కల్లూరు సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ సుకుమార్ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రామకుప్పంలో..

రామకుప్పం: స్థానిక జామియా, మదీనా, మక్కా మసీదుల్లో రంజాన్ ప్రార్థనల అనంతరం ముస్లింలు పురవీధుల్లో తక్బీర్ చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. రామకుప్పం ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనల అనంతరం కబరస్థాన్ (శ్మశానం)లో పెద్దల సమాధుల వద్ద ప్రార్థనలు చేశారు. అలాగే బల్ల, గెర్నిపల్లె, కెంచనబల్ల గ్రామాల్లోనూ ముస్లింలు రంజాన్ పండగను ఘనంగా జరుపుకున్నారు. ముస్లిం మత పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

శాంతిపురంలో..

శాంతిపురం: రంజాన్ పండుగను పురస్కరించుకుని మసీదులు, ఈద్గాలలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు ఖురాన్ సారాంశాన్ని, అవలంబించాల్సిన జీవన విధానాన్ని వివరించారు. ఖురాన్ ఆవిర్భవించిన మాసానికి గుర్తుగా, సేవ, పరస్పర సహకారానికి ప్రతీకగా రంజాన్ జరుపుకుంటామని ధార్మికోపన్యాసం ఇచ్చారు. రాళ్లబూదుగూరు, కెపి మిట్ట, ఎంకె పురం, తుమ్మిశి, నంజంపేట, కూతేగొనిపల్లె, సోడబల్ల, వెంకటేపల్లెలోని మసీదులు, ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థన కార్యక్రమాలు నిర్వహించారు.

గుడుపల్లెలో..

గుడుపల్లె: మండల కేంద్రంతోపాటు కొడతనపల్లె, గుండ్లసాగరం, కుప్పిగానిపల్లె, మిట్టూరు, గ్రామాలలో ముస్లింలు ఈద్గా వద్ద ప్రార్థనలు చేశారు. మతపెద్దలు ధార్మికోపన్యాసం చేశారు.


పుంగనూరు: పట్టణ సమీపంలోని ఈద్గాలో ప్రార్థనలు హాజరైన ముస్లింలు, ప్రసంగిస్తున్న మత గురువు



పెద్దపంజాణి: ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు, బైరెడ్డిపల్లెలో..


బైరెడ్డిపల్లె: తీర్థంలో..


పలమనేరు: ఎమ్మెల్యే ముస్లిం పెద్దల ఆశీస్సులు


చౌడేపల్లె: కోటూరులో ఈద్గా వద్ద..


సదుం: ఊరేగింపుగా వెళ్తున్న ముస్లింలు


రొంపిచెర్ల ఈద్గా వద్ద..


రామకుప్పం: ఈద్గాలో..


శాంతిపురం: కె.పి.మిట్ట ఈద్గాలో..


గుడుపల్లె: కొడతనపల్లెలోని ఈద్గా వద్ద..

వైఎస్సార్ సీపీ మెజార్టీ సాధనే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి, పక్క ఎంపీ, ఎమ్మెల్యేలు రెడ్డెప్ప, వెంకటేగౌడ, హాజరైన పార్టీ నాయకులు

- పార్టీ నాయకులకు మంత్రి పెద్దిరెడ్డి ఎన్నికలోపదేశం

గంగవరం: అర్హులందరికీ రాజకీయాలు, పార్టీకతీతంగా దరి చేర్చిన సంక్షేమ పథకాలతో సంతోషంగా ఉన్నారు..వారికి మేలు చేశాం కాబట్టే మనకు ధైర్యంగా వెళ్లి ఓటు అడిగే హక్కు ఉంది..అత్యధిక మెజార్టీ సాధనే లక్ష్యంగా కృషి చేయాలి'' అని పార్టీ నాయకులకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎన్నికలోపదేశం చేశారు. గురువారం గంగవరంలో పార్టీ మండల నేతలతో ఆయన ఎన్నికలపై సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత ఎన్నికల్లో మన నేత జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నమ్మి మండలంలో ఆరువేల మెజారిటీ వచ్చిందన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ఈ ప్రభుత్వానికి ఈసారి అంతకు మించి మెజారిటీ సాధించేందుకు అందరూ సమన్వయంతో కృషి చేయాలన్నారు. అనంతరం ఎంపీ అభ్యర్థి ఎన్ రెడ్డెప్ప, స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ వచ్చే ఎన్నికల్లో తమను గెలిపించాలని కోరారు. సమావేశంలో మాజీ ఎంపీపీ సీవీ కుమార్, సూపర్‌బజార్ అధ్యక్షులు సుభాష్ చంద్రబోస్, కన్వీనర్ మోహన్‌రెడ్డి, నాయకులు ప్రహ్లాద, చంద్రప్ప, శ్రీరాములురెడ్డి, ఏసీ బాబు, గిరిరాజారెడ్డి, కీలపట్ల స్వామి పాల్గొన్నారు.

పూలే ఆశయ సాధనకు కృషి


వీ.కోట: పూలేకు నివాళులు అర్పిస్తున్న మండల దళిత నాయకులు.

వీ.కోట: భారతదేశ తొలి అక్షర జ్యోతి మహాత్మ జ్యోతిరావ్ పూలే ఆశయ సాధన కోసం అందరూ కృషి చేయాలని మండల దళిత, బీసీ సంఘాలనేతలన్నారు. గురువారం జ్యోతిరావ్ పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద పూలే శిలాఫలకానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ, పూలే దేశంలోనే తొలి బాలికల పాఠశాలను ప్రారంభించారని, బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడి, సాధికారత కల్పనకు కృషి చేసిన మహనీయుడని కీర్తించారు. కార్యక్రమంలో దళిత నాయకులు సుబ్రమణ్యం, గణపతి, వినోద్, దొరస్వామి, శివరాం, నాగభూషణం, సోము తదితరులు పాల్గొన్నారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతి వేడుకలను రొంపిచెర్లలో ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పూలే చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులు అర్పించారు. పూలే సేవలను ప్రస్తుతించారు. పూలే బడుగు, బలహీన వర్గాల వారి అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారని, అంటరానితనం, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాడిన సంఘ సంస్కర్త అని స్మరించారు. కార్యక్రమంలో ఆసర సంస్థ అధ్యక్షుడు ధనంజయ, ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు ఓబులేసు, దివాకర్, మల్లేపల్లె వేంకటేష్, బర్డ్ సంస్థ ప్రతినిధి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రొంపిచెర్లలో..

వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం ఇంటింటా ప్రచారం


ఎల్లంకివారిపల్లెలో ఇంటింటా ప్రచారం చేస్తున్న నాయకులు

పులిచెర్ల(కల్లూరు): సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపుకోసం మండలంలోని ఎల్లంకివారిపల్లె, రాయలవారిపల్లె పంచాయతీ మేడికొండవారిపల్లెలో ఆ పార్టీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తొలుత పాలేటమ్మ గుడిలో పూజలు చేసి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. పుంగనూరు నియోజకవర్గ శాసనసభ్యులుగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని, రాజంపేట ఎంపీగా మిథున్‌రెడ్డిని ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. సంక్షేమ పథకాలు తిరిగి కొనసాగాలంటే ముఖ్యమంత్రిగా మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విరూపాక్షి జయచంద్రారెడ్డి, సైఫుల్లా, ఆనంద, రాజమూర్తి, కృష్ణమూర్తి, వెంకటేశ్, శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భర్త గెలుపు కోసం భార్య ప్రచారం


కరపత్ర ప్రచారంలో ఓటర్లను అభ్యర్థిస్తున్న పావనీగౌడ, పార్టీ నాయకులు

వి.కోట: ఎమ్మెల్యే వెంకటేగౌడను రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఆయన సతీమణి పావనీగౌడ గురువారం మండలంలో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. మండలంలోని గోనుమాకులపల్లెలో ఆమె పార్టీ మండల నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటా కరపత్ర ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తన భర్తను, చిత్తూరు ఎంపీ అభ్యర్థి రెడ్డెప్పను మరోసారి గెలిపించాలని అభ్యర్థించారు. గ్రామాల్లో తన భర్త అభివృద్ధి చేసి ఉంటేనే ఓట్లు వేయాలని, గతంతో పోల్చితే ప్రస్తుతం ఎంత అభివృద్ధి చేశారో బేరీజు వేసుకోవాలని కోరారు. టీడీపీ నాయకుల తప్పుడు హామీలను నమ్మి మోసపోరాదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజు, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాలగురునాథ్, సర్పంచ్ బాలాజీ, నాయకులు కుమార్‌రాజా, సుధాకర్‌రెడ్డి, పంచాయతీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకులు

వి.కోట: తెలుగుదేశం పార్టీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరుతున్న నాయకుల సంఖ్య మండలంలో పెరుగుతోంది. గురువారం నాగిరెడ్డిపల్లెకు చెందిన వెంకటేష్, గంగరాజు తమ కుటుంబ సభ్యులు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరారు.


పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న పావనిగౌడ

మళ్లీ సొంతగూటికి చేరారు

ఇక, మూడు రోజుల క్రితం టీడీపీలో చేరిన మండలంలోని నాగిరెడ్డిపల్లెకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు సంతోష్, క్రిష్ణప్ప ఆ పార్టీలో తాము ఇమడలేమంటూ గురువారం ఎమ్మెల్యే వెంకటేగౌడ సతీమణి పావనిగౌడ సమక్షంలో తిరిగి వైఎస్సార్ సీపీ కండువా కప్పుకున్నారు.

గణేష్ యాదవ్‌ను కలిసిన ఎమ్మెల్యే వెంకటేగౌడ


గణేష్ యాదవ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: ప్రముఖ పారిశ్రామికవేత్త, రియల్టర్ గణేష్ యాదవ్‌ను ఆయన నివాసంలో గంగవరం మండల పార్టీ నేతలతో కలిసి స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని ఆయనను కోరారు. కొన్ని రోజులుగా ప్రజల్లో ఉంటున్న ఆయనకు ఏ పార్టీ మేలు ప్రజలకు మేలు చేసిందో అవగతమై ఉంటుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని వైఎస్సార్ సీపీ గెలుపుకోసం మద్దతు ఇవ్వాలని కోరారు. దీనిపై గణేష్ యాదవ్ స్పందిస్తూ, త్వరలో తన నిర్ణయాన్ని ప్రకటిస్తానని ఆయన చెప్పారు. పార్టీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, నేతలు చంద్రప్ప, శ్రీరాములు రెడ్డి, గిరిరాజారెడ్డి పాల్గొన్నారు.